సాక్షి అనకాపల్లి

ఆదివారం । 24 । మార్చి । 2024




కాటేసిన రోడ్డు ప్రమాదం

అనకాపల్లి శంకరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరాపల్లి మండలానికి చెందిన ఇద్దరు నిరుపేద కూలీలు దుర్మరణం పాలయ్యారు. IIలో



కోవిడ్ ఫలితంగా హృద్రోగం

విశాఖ: కోవిడ్ ఫలితంగా గుండె వ్యాధిగ్రస్తులు ఎక్కువయ్యారని కెనడాలో కార్డియాలజీ వైద్యురాలు మామ్స్ తెలిపారు.



న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో ఎన్నికల గ్రీవెన్స్ సెల్

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ఎన్నికల గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్టు కమాండ్ కంట్రోల్ కేంద్రం నోడల్ అధికారి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులనైనా 08924–22655599 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1950 కూడా అందుబాటులో ఉంటుందన్నారు. గ్రీవెన్స్ సెల్ ప్రతి రోజు 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని, ఏ సమయంలోనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అప్పన్నకు పెళ్లిచూపులు రేపు



సింహాచలం: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామికి సోమవారం పెళ్లి చూపులు జరగనున్నాయి. స్వామివారు పెళ్లికుమారుడిగా ముస్తాబు అయ్యి సింహగిరి నుంచి కొండదిగువకి విచ్చేసి కొండదిగువ పుష్కరిణి సత్రంలో ఉన్న ఉద్యానవనమండపంలో వేంజేంప చేయనున్నాడు. డోలోత్సవం నిర్వహించుకోనున్నాడు. పెళ్లి నిశ్చయం అయిన ఆనందంతో అడవివరం గ్రామంలో తిరువీధి జరుపుకోనున్నాడు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో వేంజేంపచేసి సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో సింహగిరి నుంచి కొండదిగువకి మెట్ల మార్గం ద్వారా తీసుకొస్తారు. అక్కడి నుంచి అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి తిరువీధిగా తీసుకెళ్తారు. తదుపరి అక్కడి నుంచి పుష్కరిణి సత్రంలో ఉన్న ఉద్యానవన మండపానికి తీసుకెళ్లి స్వామిని డోలీలో వేంజేంపచేస్తారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం, డోలోత్సవాన్ని నిర్వహిస్తారు.

అందుబాటులో శ్రీవారి అగరబత్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ దేవస్థానం తయారు చేసిన అగరబత్తులు అందుబాటులో ఉన్నట్లు ఆలయ ఏఈవో జగన్‌మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.45 నుంచి కాంబో ప్యాక్ రూ.450 వరకు విలువైన అగరబత్తులు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆహ్లాదకరం... హరితహారం

- నూతన తారురోడ్లకు ఇరువైపులా మొక్కలు
- జిల్లాలో 100 కిలోమీటర్ల మేర 40 వేల మొక్కల పెంపకం
- బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా మరో 40 వేలు
- ఎన్‌టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో మొక్కల సంరక్షణ

కె.కోటపాడు: జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన తారురోడ్లకు ఇరువైపులా మొక్కలను పెంచే కార్యక్రమాన్ని సోషల్ ఫారెస్ట్ అధికారులు చేపడుతున్నారు. సోషల్ ఫారెస్ట్‌లలో పెంచుతున్న మొక్కలను చక్కని తారురోడ్లకు ఇరువైపులా నాటుతున్నారు. జిల్లాలో అనకాపల్లి, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో రోడ్లుకిరువైపులా మొక్కలను పెంపకాన్ని చేపడుతున్నారు. ప్రధానంగా ప్రయాణికులకు నీడనిచ్చే బాదం, కదంబ, ఫెల్టోఫారం, తురాయి, తెల్లమద్ది వంటి రకాలైన మొక్కలను నాటారు.

100 కిలోమీటర్లలో మొక్కల పెంపకం

జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో సుమారు 100 కిలోమీటర్లలో రోడ్డుకిరువైపులా 40 వేల మొక్కలను నాటారు. ఆయా మొక్కలకు రక్షణగా గ్రీనరీ క్లాత్‌లను ఏర్పాటు చేశారు.

వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నీటి అవసరం ఉన్న సమయాల్లో ట్యాంకర్‌ల ద్వారా నీటి తడులను అందిస్తూ మొక్కలను సంరక్షిస్తున్నారు. బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా సోషల్ ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, ఏపీఐఐసీ ఇండస్ట్రీ భూముల్లోను, మార్కెట్ యార్డ్‌ల వద్ద మరో 40 వేల మొక్కలను నాటుతున్నారు. ఈ ప్లాంటేషన్‌ను సోషల్ ఫారెస్ట్ అధికారులు ఎన్‌టీపీసీకి చెందిన సీఎస్‌ఆర్ నిధులతో చేపడుతున్నారు.



రోడ్డుకిరువైపులా పెంచుతున్న నీడనిచ్చే మొక్కలు





మొక్కల సంరక్షణను పరిశీలిస్తున్న సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్

వేసవిలో మొక్కలకు ప్రత్యేక సంరక్షణ



అనకాపల్లి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో సీఎస్‌ఆర్ నిధులతో రోడ్లుకిరువైపులా మొక్కల పెంపకాన్ని చేపడుతున్నాం. నాటిన మొక్కలకు రక్షణగా గ్రీనరీ క్లాత్ ఏర్పాటుతో పాటు వేసవి కాలంలో మొక్కలను అవసరమయిన సమయాల్లో ట్యాంకర్లతో నీటి తడులను అందించే చర్యలను చేపడుతున్నాం. నాటిన ప్రతీ మొక్క ఆరోగ్యకరంగా ఉండే విధంగా చూస్తున్నాం.

–జి.లక్ష్మణ్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో

ఆహ్లాదకరంగా ప్రయాణం



కె.కోటపాడు మండలంలో ఎ.భీమవరం–ఎం.అలమండ, ఆనందపురం–కొరువాడ, వై.జంక్షన్–పిండ్రంగి, సూర్రెడ్డిపాలెం–మేడిచర్ల గ్రామాల గుండా కొత్తగా నిర్మాణం చేసిన తారు రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. వాటికి రక్షణగా గ్రీనరీ క్లాత్‌లు ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కన గల పచ్చని మొక్కల మధ్య వాహనాలపై ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటోంది. మొక్కలు నాటడం వల్ల పచ్చదనం పెంపొందడంతో పాటు వాతావరణ సమతుల్యత ఏర్పడుతుంది.

–చిరికి గోవింద, చిరికివానిపాలెం గ్రామం, కె.కోటపాడు మండలం

రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

- సబ్ జడ్జి అరుణశ్రీ



రిమాండ్ ఖైదీల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సబ్ జడ్జి అరుణశ్రీ

చోడవరం రూరల్: రిమాండ్‌లో ఉన్న నిరుపేదలైన ఖైదీలు న్యాయవాదులను నియమించుకోలేని పక్షంలో వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవ ప్రాధికార సంస్థ చైర్‌పర్సన్ సత్తి అరుణశ్రీ తెలిపారు. శనివారం సబ్ జడ్జి స్థానిక సబ్ జైలును సందర్శించారు. ముందుగా రిమాండ్‌లో ఉన్న ఖైదీల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. వారికి సకాలంలో, నాణ్యమైన రీతిలో ఆహారం అందిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైలులో పరిశుభ్రత, ఇతర సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. అనంతరం రిమాండ్ ఖైదీలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర న్యాయశాఖ లోక్ అదాలత్ కమిటీల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. నేర ప్రవృత్తి నుంచి సాధారణ జన జీవన స్రవంతిలో ఒక పౌరునిగా తీర్చిదిద్దడమే జైలు లక్ష్యమని, నేర ఆలోచనకు స్వస్తి పలికి మంచి పౌరునిగా మార్పు పొందడానికి ఖైదీలు పరివర్తన చెందాలని ఆకాంక్షించారు. సబ్‌జైలు హెడ్ వార్డర్ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ పోస్ట్‌ల వద్ద ముమ్మర తనిఖీలు

- రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వారిని బైండోవర్ చేయాలి
- ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- పోలీస్ క్రైం సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం



సమీక్ష సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి : ఎన్నికల నిర్వహణలో భాగంగా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో నెల వారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సీఆర్‌పీసీ కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కే సుల ను సమీక్షించారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో గల అన్ని నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారు లు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలను ఏమాత్రం ఉ ల్లంఘించినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా అనకాపల్లి జిల్లాలో 9 చెక్‌పోస్టలను జిల్లా పోలీసులతో పాటు కేంద్ర పో లీసు దళాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి మాదక ద్రవ్యాలు, నాటు సారా, మద్యం అక్రమ ర వాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఎన్‌ఫో ర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. రౌడీషీ టర్‌లు, చెడు నడత కలిగిన వారిని బైండోవర్ చేయించాలన్నారు. ప్రతిభ కనబరిచిన ఆరుగురు అధికారులు, సిబ్బందిని ప్రశంసా పత్రాలతో జిల్లా ఎస్పీ సత్కరించారు. అదనపు ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోక్సో చట్టం.. చిన్నారులకు రక్షణ కవచం





సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, హాజరైన వివిధ శాఖల అధికారులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: బాలికలకు ఎటువంటి హాని జరగకుండా.. వారిని రక్షించే బాధ్యత అందరిదీ అని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో పోక్సో చట్టం–2012, మోటారు వాహన ప్రమాద చట్టం, తదితర అంశాలపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, బాలికలు, యువతులు, కౌమార దశ బాలికలను తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా తగిన రక్షణ కల్పించాలన్నారు. పోక్సో చట్టం సెక్షన్ 7, 8, 12 గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

ఏ ఒక్క బాలికకు అన్యాయం జరిగినా.. అది వారి జీవితాలతోపాటు సమాజంపై కూడా ప్రభావం చూపుతుందన్నారు. ఇటీవల వయసుతో పని లేకుండా మానవ మృగాలు చేస్తున్న అకృత్యాలపై న్యాయస్థానాల సైతం తీవ్రంగా స్పందిస్తున్నట్లు చెప్పారు. పోక్సో చట్టం చిన్నారులకు ఒక రక్షణ కవచంగా అభివర్ణించారు. ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ చిన్నారులు ఉన్నత విద్యావంతులుగా రాణించాలని కోరారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. బాలల భద్రత–న్యాయ సేవా సంస్థ అందిస్తున్న సేవలపై రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ ప్రసంగించారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైల శ్రీనివాసరావు పలు అంశాలపై మాట్లాడారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండదండగా..

- గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత సంక్షేమం
- రైతన్న చెంతకే భరోసా కేంద్రాలు
- సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- 2,50,888 మంది రైతులకు పెట్టుబడి సాయం
- చంద్రబాబు హయాంలో వ్యవసాయంపై చిన్నచూపు
- రైతన్నకు నాడు వంచన.. నేడు భరోసా



నర్సీపట్నంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్



సాక్షి, అనకాపల్లి, చోడవరం, అచ్యుతాపురం, నక్కపల్లి, గొలుగొండ: నాడు టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రైతులను వంచించారు. ఎన్నికల ముందు హామీలు గుప్పించి అధికారం చేపట్టాక రైతులను నిలువునా మో సం చేశారు. రైతు రుణమాఫీ అన్నారు. నిలువునా వంచించారు. ఇక రైతుకు ఎరువులు, విత్తనాలు ఇచ్చిన సందర్భాలే లేవు. 2014–19 వరకు రైతుకు చంద్రబాబు వేసిన వాతలు ఇప్పటికీ పచ్చిగానే ఉన్నాయి. ఎలాగైనా అధికారంలోకి రావాలనే తలంపుతో తప్పుడు హామీలు గుప్పిస్తూ ప్రజలను వంచించే ప్రయత్నం మళ్లీ మొదలైంది. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ల్లో 98 శాతం నెరవేర్చి నవ శకానికి నాంది పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం నుంచి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం కల్పించింది. విత్తనం వేసి పంట చేతికి వచ్చేవరకు రైతన్నలకు అన్ని విధాల అండగా నిలిచేలా రైతు భరోసా కేంద్రాలను (ఆర్బీకేలు) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయ పరిధిలో ఆర్బీకేలను ఏర్పాటు చేసి 'రైతు భరోసా' సంక్షేమ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించారు. కౌలు రైతులకూ రైతుభరోసా కల్పించింది. అంతేకాకుండా ఆర్బీకేల ద్వారా రైతన్నకు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించింది. రైతు పంట వేసి గిట్టుబాటు ధర లేక నష్టపోకుండా పంట బీమా సౌకర్యం, కౌలు రైతులకు రైతు భరోసా, ఈ క్రాప్ నమోదు, సాగు యంత్రాలు సమకూర్చడం, సాగు సలహాలు..వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు, పశుసేవలు ఇలా రైతన్నకు అన్ని సౌకర్యాల కల్పిస్తూ ఆర్బీకేలను ఆల్ ఇన్ వన్‌గా రైతుకు అండగా నిలిచాయి.

నాడు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అంటూ మెలిక

2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు కోట్ల రూపాయలు మాఫీ కావాల్సి ఉంది. చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టాక రైతుల వ్యవసాయ రుణాల మాఫీలో అనేక షరతులు విధించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అంటూ మెలికపెట్టి కుటుంబానికి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకే మాఫీ అంటూ ప్రకటించారు. ఇందువల్ల కొద్దిపాటి మందికి తూతూ మంత్రంగా మాఫీ లభించింది. అది వ్యవసాయ రుణాల మాఫీ కాదు.. దీంతో బ్యాంక్‌లకు రుణాలు కట్టకుండా రైతులు ఉండడంతో అప్పులు పేరుకుపోయాయి. చివరికి డబుల్ వడ్డీతో రైతులు బ్యాంక్ రుణాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతులకు ఉచిత బీమా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో బీమా మొత్తానికి 2 నుంచి 5 శాతం ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేది. అది కూడా వేలాది రూపాయల ప్రీమియం చెల్లించినప్పటికీ పరిహారం తూతూ మంత్రంగా వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా సదుపాయం కల్పించింది.


పంట హక్కు సాగు పత్రాలు

కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పంట సాగు హక్కు పత్రం వారి పాలిట వరంగా మారింది. కౌలు రైతులు ఇబ్బంది పడుతున్న పాత విధానానికి స్వస్తి పలుకుతూ వారికి మరింత ప్రయోజనం చేకూరేలా క్రాప్ కల్టివేషన్ రైట్స్ సర్టిఫికెట్(సీసీఆర్‌సీ) కార్డులను ప్రభుత్వం అందించింది. భూయాజమాని హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా వ్యవసాయశాఖ రాయితీలు, పంట రుణాలు కౌలుదాదరులకు అందేలా చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకు జిల్లాలో 8,804 మంది కౌలు రైతులకు కార్డులు అందించారు.

ఐదేళ్లలో పెట్టుబడి సాయం..

అన్నదాతల కోసం ప్రతి ఏటా రైతుల పెట్టుబడి కష్టాలను తీర్చేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసాను అమలు చేస్తోంది. గడచిన ఐదేళ్లలో ఒక్క వైఎస్సార్ రైతు భరోసా కిందనే అన్నదాతలకు జిల్లాలో 2,50,888 మంది రైతులకు పెట్టుబడి సాయంగా రూ.1693.49 కోట్లు అందింది.

జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 1,75,435 హెక్టార్లు ఉంది. వీటిలో ఇప్పటివరకు 60,161 హెక్టార్లలో పంటలు వేశారు. అందించిన ఎరువులు, విత్తనాలు, ఇతర సాయం వివరాలు ఇలా ఉన్నాయి..
2019-24లో 4,327.5 క్వింటాళ్ల విత్తనాలు
2019-24లో 8,190 మెట్రిక్ టన్నుల ఎరువులు
420 గ్రూపులకు రూ.937.92 లక్షలతో 229 ట్రాక్టర్లు అందించారు.
ఈ పంట నమోదు 2,50,044 ఎకరాల వివిధ పంటలకు నమోదు చేశారు
6 నియోజకవర్గాల్లో 450 ఆర్బీకేలు, 6 అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశారు.



రైతు భరోసా లబ్ధిదారులు 2,50,888

అందించిన లబ్ధి రూ.1693.49 కోట్లు

నియోజకవర్గాలు	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో)
నర్సీపట్నం	37,296	251.74
చోడవరం	51,724	349.13
మాడుగుల	45,467	306.90
యలమంచిలి	34,937	235.82
అనకాపల్లి	24,240	163.62
పాయకరావుపేట	41,071	277.22
పెందుర్తి (సబ్బవరం, పరవాడ)	16,153	109.03
మొత్తం	2,50,888	1693.49

పెట్టుబడికి 'భరోసా'



నా పేరు వరవాడ నూకినాయుడు. మాది లింగంపేట గ్రామం. నేను వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాను. గతంలో ఏ ప్రభుత్వం రైతు గురించి ఆలోచించలేదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతుకు ఎంతో మేలు జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా ఇవ్వడం వల్ల రైతుకు ఎంతో ఊరట వచ్చింది. నాకు నాలుగు విడతలగా రూ.54 వేలు రావడం జరిగింది. జూన్‌లో వ్యవసాయ పెట్టుబడికి నగదు ఇవ్వడంతో నాకు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉండేది. ఈ నగదుతో వ్యవసాయం చేసి వచ్చిన లాభాలతో రెండు ఆవులు కొనుగోలు చేసుకున్నాను. ప్రస్తుతం వ్యవసాయంతో పాటు పాడిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. రైతులంతా ఇటువంటి పాలనే మళ్లీ రావాలని కోరుకుంటున్నారు.

రైతు భరోసా వల్లే ముందుకు 'సాగు'తున్నా...



నా పేరు బీమిశెట్టి శ్రీనివాస్. మాది హరిపాలెం. అచ్యుతాపురం మండలం. తల్లిదండ్రులు ఇచ్చిన భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించాను. ఇద్దరికి వివాహం చేశాను. మూడో కుమార్తె సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, నాలుగో సంతానమైన కుమారుడు చదువుతున్నాడు. ప్రస్తుతం ఒకటిన్నర ఎకరాల పొలంలో వరి సాగు చేస్తున్నాను. ఏడాది పొడవునా వరి పంట సాగు చేస్తే పెట్టుబడికి రూ.30 వేలు ఖర్చు అవుతుండగా, 40 బస్తాల ధాన్యం దిగుబడి వస్తోంది. పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ.13,500 ఇంటి అవసరాలు, వ్యవసాయ సాగుకు ఉపయోగపడుతోంది. రైతు భరోసా పథకంతో ఎందరో రైతులు సాగులో నిలబడుతున్నారు.

ఇంక అప్పు సేత్తలేను....



నా పేరు బలిరెడ్డి రామాంజనేయులు, మాది సోడవరం పంచాయతీ, పకీర్‌సాయిబుపేట. నాకు రెండెకరాల పొలం వుంది. ఇంతకుముందు యవసాయానికి పెట్టుబడుల కోసం సోడారంలోని సావుకార్లు సుట్టూ తిరిగి, పంట పండాక వొడ్డీతో తిరిగి కట్టేవోల్లం. ఏటా ఇరవ్వేలు అప్పు తెత్తే వొడ్డీతో కట్టడం వచ్చిన పంట డబ్బు సావుకార్లకే ఇచ్చేయాల్సి వొచ్చేది. కానీ జగనొచ్చింకాడ్నించీ మాకు రైతుబరోసా డబ్బు లు పడుతున్నాయ్.ఈ అయిదేల్లా దపదపాలు గా బేంకులో రైతు భరోసా డబ్బు పడింది. దీంతో మాకు పంటల పెట్టుబడి టైంకి ఆ డబ్బులు పని కొత్తన్నాయ్. మా గేమంలోనే రైతుబరోసా ఆపీసెట్టారు. అక్కడికెల్తే ఎరువులు, ఇత్తనాలు ఏ రకం కావాలంటే అయి వొత్తన్నాయ్. మాకు లోను మీద వడ్డీ రాయితీ కూడా పడింది. మా ఆడమనిషి డోక్రాలో ఉంది. ఆయమ్మకి డబ్బులు పడ్డాయి. ఇంక అప్పుసెత్త నేదు. పండినకాడికి పంట సేతికొత్తంది.

తిండి గింజలకు లోటు లేదు



నా పేరు కోరెడ్డి లక్ష్మి, మాది కొరుప్రోలు, ఎస్.రాయవరం మండలం. మాకు 60 సెంట్లు భూమి ఉంది. మాది పేద కుటుంబం. నా భర్త ఆటో నడుపతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. నాకు ఆరోగ్యం బాగాలేక అప్పులు చేసి వ్యవసాయం చేయడం మానేసాం. 2019 వరకు భూమిని కౌలుకి ఇచ్చేశాం . పెట్టుబడికి వడ్డీకీ అప్పు తేవడానికి ఇబ్బంది పడేవాళ్ళం. జగనన్న అధికారంలోకి వచ్చాక మాకు ప్రతి ఏటా రైతు భరోసా రూ.13,500 ఇవ్వడంతో మళ్లీ వ్యవసాయం చేయడం మొదలు పెట్టాము. తిండిగింజలు పండించుకుంటున్నాం. సాగు కోసం అప్పు చేసే బాధ తప్పింది. పండించే ధాన్యం తిన డానికి ఉపయోగించుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాం. ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదు, మా భూమి మేమే పండించుకుంటున్నాం. అయిదేళ్ల నుంచి రైతు భరోసా అందుతోంది.

ఇద్దరిని కాటేసిన రోడ్డు ప్రమాదం



రోడ్డు ప్రమాదానికి గురైన పూడి గంగునాయుడు, ఆదిరెడ్డి గంగునాయుడు



ప్రమాదంలో గాయపడ్డ అప్పారావు




కాశీపురంలో రోదిస్తున్న పూడి గంగునాయుడు కుటుంబ సభ్యులు

- శంకరం వద్ద అదుపు తప్పిన వ్యాన్
- కూలి పనికి వెళ్లి తిరిగి రాని లోకాలకు నిరుపేద కూలీలు
- కాశీపురంలో పెళ్లింట విషాదం

అనకాపల్లి/దేవరాపల్లి : పెందుర్తి నుంచి యలమంచిలి వెళ్తున్న బొలెరో వ్యాన్ అనకాపల్లి మండలం శంకరం జాతీయ రహదారిలో అదుపు తప్పి డివైడర్, విద్యుత్‌పోల్‌ను ఢీకొని బోల్తాపడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపట్టారు. స్థానికులు, రూరల్ పోలీసుల కథనం మేరకు దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన పూడి గంగునాయుడు (66), ఆదిరెడ్డి గంగునాయుడు (74), అప్పారావు కూలిపనుల నిమిత్తం ప్రతిరోజు దేవరాపల్లి నుంచి పెందుర్తి వెళ్తుంటారు.

అక్కడ టైల్స్ తీసుకుని యలమంచిలి వెళ్తారు. శనివారం కూడా బొలెరో వ్యాన్‌లో కాశీపురానికి చెందిన మేస్త్రీ గోపి, వ్యాన్ డ్రైవర్ జి.అప్పారావుతో పాటు యలమంచిలి బయలుదేరారు. అయితే వారి వాహనం అనకాపల్లి మండలం శంకరం జాతీయ రహదారిలో అధిక వేగంతో వెళ్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పూడి గంగునాయుడు, ఆదిరెడ్డి గంగునాయుడు, అప్పారావుపై ఫ్లోరింగ్ పలకలు పడి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా పూడి గంగునాయుడు, ఆదిరెడ్డి గంగునాయుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. అప్పారావు కుడి చెయ్యి విరిగిపోవడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మేస్త్రీ గోపి, వ్యాన్ డ్రైవర్ జి.అప్పారావు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు ఆదిరెడ్డి గంగునాయుడు అల్లుడు పెంటా అర్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు చెప్పారు.



మృతులు పూడి గంగునాయుడు (ఫైల్)



ఆదిరెడ్డి గంగునాయుడు (ఫైల్)

పెళ్లింట విషాదం..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పూడి గంగునాయుడు ఏకైక కుమారుడు జోగినాయుడుకి ఏప్రిల్ 13న వివాహం జరిపించేందుకు నిశ్చయించారు. ఈ వివాహ వేడుకలకు సంబంధించి పెళ్లి పనులు సైతం ప్రారంభించారు. ఏప్రిల్ 5న ప్రతాణం జరగాల్సిన తరుణంలో కుటుంబ పెద్ద గంగునాయుడు అకాల మృతితో ఈ కుటుంబం దు:ఖ సాగరంలో మునిగిపోయింది. పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు బాజాలు మోగడంతో ఆ కుటుంబ పరిస్థితిని చూసిన వారంతా కన్నీటి పర్యంతమయ్యారు. కొడుకు పెళ్లి చూడకుండానే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ గంగునాయుడు భార్య సత్యవతి గుండెలవిసేలా రోదించిన తీరు పలువురి హృదయాలను కలచివేసింది. ఇదే ప్రమాదంలో మృతి చెందిన ఆదిరెడ్డి గంగునాయుడికి భార్య ఈశ్వరమ్మ, కుమార్తె కన్నతల్లి, కుమారుడు సత్తిబాబు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఈ కుటుంబం పుట్టెడు దు:ఖంలో మునిగిపోయింది. కూలి పనికి వెళ్లి తిరిగిరాని లోకాలకు తరలిపోయావా, ఇక మాకు దిక్కెవరు అంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



పార్టీ కండువాలతో మద్దతు ప్రకటిస్తున్న గొల్లపేట ప్రజలు

- టీడీపీలో చేరినట్లు జరిగిన ప్రచారం అవాస్తవం
- గవరపాలెం శివారు గొల్లపేటకు చెందిన 30 కుటుంబాల స్పష్టీకరణ

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా అంతా కష్టపడి పని చేయాలని స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. పట్టణంలో గల కంటోన్మెంట్ ఏరియాలో ఉమ్మడి జిల్లాల భీమ్‌సేన ప్రధాన కార్యదర్శి, సీనియర్ దళిత నాయకుడు నెలపర్తి అర్జున్‌రావు ఆధ్వర్యంలో 30 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గారా చంటి, ఏనుగుపల్లి అప్పారావు, దండు నాగు, రాయి విష్ణు తదితర కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా వారికి కంబాల జోగులు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు యథాప్రకారం అందాలన్నా, అర్హులందరికీ సొంతింటి కల నెరవేరాలన్న రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, గ్రామ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వేమగిరి లక్ష్మణ్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, పంచాయతీ వార్డు సభ్యులు ధనిశెట్టి మహేష్, పిరాధి రాజు, పలువురు పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మేమంతా వైఎస్సార్‌సీపీతోనే ఉంటాం

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ పార్టీ ఆవిర్భావం నుండి తామంతా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమని గవరపాలెం శివారు గొల్లపేటకు చెందిన 30 కుటుంబాల వారు స్పష్టం చేశారు. ఈ నెల 19న గొల్లపేటకు చెందిన పలువురు టీడీపీలో చేరినట్లు జరిగిన ప్రచారం అవాస్తవమని గవరపాలెం ఆర్బీకే కన్వీనర్ కోట సూర్యనారాయణ తెలిపారు. తాము వైఎస్సార్‌సీపీలోనే ఉండడంతో పాటు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వెంటే 10 సంవత్సరాలుగా కొనసాగుతున్నట్లు తెలిపారు. గొల్లపేటలో సీసీ రోడ్లు, విద్యుత్ లైన్, చేతిబోర్లు, అర్హులకు పింఛన్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అందినట్లు సూర్యనారాయణ తెలిపారు. మంచి చేసిన ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వెంటే గొల్లపేటలోని మొత్తం కుటుంబాలు ఉంటాయని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గొలగాని సింహాద్రి, మాజీ చైర్మన్ గొలగాని గోవింద అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా తాము వైఎస్సార్‌సీపీతోనే ఉంటామని తెలిపారు. తాము పార్టీ మారినట్లు టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. కోట దేముడు, చిన పైడితల్లి, ఈశ్వరరావు (అబద్ధం), పోలమ్మ, కోట దేముడమ్మ, రామునాయుడు, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్సును బైక్‌తో ఢీకొని యువకుడి దుర్మరణం



ఆస్పత్రిలో ప్రథమ చికిత్స సమయంలో ప్రసాద్

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో శనివారం బైక్‌తో బస్సును వెనుక నుండి ఢీకొన్న ఘటనలో బైక్ నడుపుతున్న బొబ్బిలి ప్రసాద్ (24) మృతి చెందాడు. చౌడువాడ నుండి కె.కోటపాడు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అదే మార్గంలో వస్తూ బైక్‌తో ప్రసాద్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో ప్రసాద్ తలకి తీవ్ర గాయం కావడంతో పాటు కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108లో కె.కోటపాడు సీహెచ్‌సీకి,అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అయితే కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ప్రసాద్ మృతి చెందినట్లు 108 సిబ్బంది బి.నరసింహమూర్తి తెలిపారు. మృతుడు ప్రసాద్‌ది శరభవరం. అచ్యుతాపురంలోని ఇషాన్ ఆస్పత్రిలో పని చేస్తున్న ప్రసాద్ కె.కోటపాడులో పరీక్షలు రాసేందుకు వస్తున్న సమయంలో ప్రమాదానికి గురై మరణించాడు. కె.కోటపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు.

బ్లాక్ కరెన్సీ కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన ఎయిర్‌పోర్టు పోలీసులు
- కారు, 10 ఫోన్లు స్వాధీనం

గోపాలపట్నం: బ్లాక్ కరెన్సీ కేసులో ప్రధాన నిందితుడు షేక్ అబ్దుల్ గని అలియాస్ (గనిరాజు)ను ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్టు చేసి, శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. గత నెల 20న కాకానినగర్‌లోని ఓ ట్రావెల్స్ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న బ్లాక్ కరెన్సీ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు. విశాఖకు చెందిన కోసుంపూరి వెంకట కన కదుర్గరాజు అలియాస్ భాస్కరరావు, పశ్చిమ గోదావరి జిల్లా యండగండికి చెందిన మద్దాల శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3 కోట్ల విలువైన మూడు బ్యాగుల్లో బ్లాక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా.. దీనికి సూత్రధారి గనిరాజు అని వారు వెల్లడించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అప్పటి నుంచి అతని కోసం గాలిస్తున్నారు. కాగా.. శుక్రవారం కాకానినగర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కారులో ఉన్న గనిరాజును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా నల్లటి రంగు పూసిన కాగితాలను రసాయనంలో ముంచితే అసలు కరెన్సీగా మారుతుందని నమ్మించి మోసానికి పాల్పడుతున్నట్లు తెలిపాడు. అతనిది కాకినాడ దగ్గరలోని పెనుమర్తి ప్రాంతం. పదేళ్ల కిందట నిందితుడిపై దొంగ నోట్ల మార్పిడి కేసు నమోదైంది. అతని నుంచి కారు, 10 మొబైల్ ఫోన్లు, బంగారు చైన్, వాచ్ స్వాధీనం చేసుకున్నారు. శనివారం అతన్ని రిమాండ్‌కు తరలించారు.

లైంగిక వేధింపుల ఆరోపణలతో వైద్యుడి సస్పెన్షన్

మహారాణిపేట: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజీహెచ్ పిల్లల వైద్యుడు డాక్టర్ రొక్కం భవానీశంకర్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్(డీఎంఈ) డాక్టర్ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి ఆయనపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. డీఎంఈ నుంచి వచ్చిన ఉత్తర్వులను సంబంధిత వైద్యుడికి అందజేసినట్లు ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు.

పాడి గేదెకు ప్రాణం పోసిన వైద్యుడు

బుచ్చెయ్యపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయిన పాడి గేదెకు వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శివకుమార్ వైద్య సేవలందించి ఊపిరి పోశారు. శనివారం మధ్యాహ్నం దిబ్బిడి గ్రామానికి చెందిన రైతు కంచిపాటి రమణ పెదమదీనలో పాడి గేదె, పెయ్యి కొనుగోలు చేశాడు. పాడి గేదెను టాటా ఏస్ వ్యాన్‌లో ఎక్కించుకుని వస్తుండగా బంగారుమెట్ట జంక్షన్ వద్ద డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేక చెట్టును ఢీకొట్టాడు. దీంతో గేదెకు తీవ్ర గాయాలై స్పృహ తప్పి పడిపోవడంతో స్థానిక యువకులు పాడి గేదెకు కట్టిన కట్లు విప్పేసి వ్యాన్‌లో నుండి కిందకు దించారు. వడ్డాది పశువుల ఆస్పత్రి వైద్యుడికి సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆయన సిబ్బందితో వచ్చి గేదెకు సపర్యలు చేశారు.



పాడి గేదెకు సెలైన్ బాటిల్ ఎక్కిస్తున్న వైద్యుడు శివకుమార్

తీవ్రమైన ఎండలో రోడ్డుపైనే సిబ్బందితో గేదెకు వైద్యం చేసి ఇంజక్షన్లు వేశారు. సెలైన్ బాటిల్స్ పెట్టడంతో గేదె స్పృహలోకి వచ్చి తేరుకుంది. ప్రమాదంలో గేదె పెయ్యికి, వ్యాన్ డ్రైవర్‌కి ఎటువంటి ప్రమాదం జరగలేదు. వడ్డాది ఆస్పత్రి సిబ్బంది హరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధ్యాన వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



కశింకోట : కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వర స్వామిని శనివారం అందంగా అలంకరించారు. వజ్ర కవచంతో పాటు ఆభరణాలు, పూలమాలలతో స్వామి వారిని అందంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కశింకోట : మండలంలోని తేగాడలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఐ. మార్తా తిలకం కోరారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 22లోగా అవసరమైన వివరాలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కొక్క కోర్సులో 40 వంతున సీట్లు ఉన్నాయన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 వంతున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. టెన్త్‌లో వచ్చిన మార్కులు, ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్ల ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తామన్నారు. స్టడీ, ఆధార్ కార్డు, పాసు పోర్టు సైజు ఫొటో తదితర అవసరమైన ధ్రువపత్రాలతో అర్హులు ఆన్‌లైన్‌లో గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పోషకాహారం పంపిణీ

అనకాపల్లి : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ప్రభుత్వం అందజేసే మందులు వాడుకుంటూ, పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని దివ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు వి.వరప్రసాద్‌రాజు అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో 50 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు 8 రకాల పోషకారాలను శనివారం అందజేశారు. 2007 నుంచి వ్యాధిగ్రస్తులకు బియ్యం, చోడి పిండి, గోధుమ పిండి, బఠాణీ, ఆయిల్, బెల్లం, కిరాణా సామాన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ సభ్యులు రూబీ, దొరతి, జైపాల్ బాబు, వెంకట రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రం పరిశీలన



టెన్త్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన అదనపు ఎస్పీ విజయభాస్కర్

కశింకోట : స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో టెన్త్ పరీక్షల నిర్వహణ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ బి. విజయ భాస్కర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సీఐ ఎం. వినోద్‌బాబు ఆయన వెంట ఉన్నారు.

మోదీ ప్రభుత్వంలో వ్యవస్థలు విధ్వంసం

అనకాపల్లి : దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవస్థలను విధ్వంసం చేశారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేష్ అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ ప్రభుత్వం దేశంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ వక్తులకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి నాయకులు డాక్టర్ బూసిరాజు, అచ్యుతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కన్వీనర్ వై.ఎస్.భద్రం, కోన లక్ష్మణ్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
గామి	:	సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	:	సత్యనారాయణస్క్రీన్-2
అనన్య	:	షిర్డిసాయి
ఓం భీం బుష్	:	పర్తిసాయి
యమధీర	:	వెంకటేశ్వర
రికార్డ్ బ్రేక్	:	శ్రీసత్య
భీమా	:	రామచంద్ర

కళాశాలకు కార్పొరేట్ కళ



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం

- రేబాక పాలిటెక్నిక్ కాలేజీకి అధునాతన హంగులు
- రూ. 25 లక్షలతో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్
- అందుబాటులోకి ప్రపంచ స్థాయి లోటస్ వైర్లెస్ టెక్నాలజీ

గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మెరుగైన విద్యాబోధన చేస్తున్నాయి. దీంతో సాంకేతిక రంగంలో విద్యార్థులు దూసుకుపోతూ చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. నిష్ణాతులైన అధ్యాపకులు, చక్కటి వసతులు, బోధనకు అవసరమైన సాంకేతికతతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దుతున్నాయి.



కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్

తుమ్మపాల : అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గడచిన ఏడాది కాలంగా అభివృద్ధిపథాన దూసుకుపోతోంది. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉపాధి అందించాలనే లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు ఇక్కడి అధ్యాపక బృందం. సాంకేతికత అభివృద్ధితోనే యువత ఉజ్వల భవితను అందుకోగలరని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు పాలిటెక్నిక్ కళాశాలల ఆధునీకరణకు కేటాయించిన నేపథ్యంలో ఆయన కలలు ఈనాడు సాకారం అవుతున్నాయి. దీనిలో భాగంగా రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పెనుమార్పులు జరిగాయి. అనకాపల్లికి శాశ్వత భవనాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను రేబాకలో ప్రారంభించారు. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో ఇప్పుడు ఈ కళాశాల కార్పొరేట్ కళాశాలలను తలపించే విధంగా తయారయింది. దాదాపు రూ.10 లక్షలతో కళాశాలలో ఎలక్ట్రికల్ ల్యాబ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి చేశారు. ప్రత్యేక శ్రద్ధతో రూపొందించిన కళాశాల భవనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

రూ.25 లక్షలతో అధునాతన కంప్యూటర్ ల్యాబ్..

ఈ కళాశాల పేరుకే ప్రభుత్వ కళాశాల అయినప్పటికీ ఇందులోని వసతులన్నీ కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఉండేలా రాష్ట్ర సాంకేతిక, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కళాశాలలో రూ. 6 లక్షలతో వసతులు కల్పించారు. గడచిన ఏడాది రూ.25 లక్షలతో అధునాతన టెక్నాలజీ గల లోటస్ వైర్లెస్ టెక్నాలజీ కలిగిన 30 కంప్యూటర్లతో కూడిన ల్యాబ్ ఏర్పాటుకు కృషి చేశారు. దీంతో కళాశాలలో ఉండే మొత్తం 360 మంది విద్యార్థులు తరగతుల వారీగా సాంకేతికాంశాలను అభ్యసించనున్నారు.

జీపీఎస్ ట్రాకర్ తయారు చేశాం..



నేను కళాశాలలో చేరిన మొదటి ఏడాది కంప్యూటర్ ల్యాబ్ లేదు. ఇప్పుడు టెక్నాలజీకి తగ్గట్లు అధునాతన కంప్యూటర్లు ఉన్నాయి. కంప్యూటర్ ల్యాబ్‌లోనే ప్రాజెక్టు పాండా, వాయిస్ అసిస్టెన్స్ ఫర్ సిస్టం, జీపీఎస్ ట్రాకర్, రోబో, డైనమిక్ వెబ్‌సైట్ వంటివి అభివృద్ధి చేశాం. నాతో పాటు కళాశాలకు చెందిన కె.అభిరామ్, కె.సత్యదత్తా, డి.విశ్వనాథ్ జీపీటీఏపీ.గ్రేట్-సైట్.నిట్ తయారు చేసి కళాశాలల తరపున నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకు సబ్మిట్ చేశాం. రిజల్ట్ కోసం ఎదురు చూస్తున్నాం.

– వాసనాబి నిఖిత్‌నాగ్, సీఎంఈ, ఫైనల్ ఇయర్

అందుబాటులోకి అధునాతన టెక్నాలజీ..



మా ప్రోగ్రామింగ్ స్కిల్స్ మేమే మెరుగుపరుచుకోగలుగుతున్నాం. రాష్ట్ర సాంకేతిక, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి మేడం మా కళాశాలకు 30 కంప్యూటర్లతో కూడిన ల్యాబ్‌ను ఇటీవల ప్రారంభించి మాకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కంప్యూటర్లు సరికొత్త టెక్నాలజీతో అప్‌డేట్‌గా ఉన్నాయి. కళాశాలకు అందుబాటులో అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉండడంతో కొత్త ప్రోగ్రాంలు సులువుగా చేయగలుగుతున్నాం. కొత్త సాఫ్ట్‌వేర్స్ అందుబాటులోకి వచ్చాయి.

– కె.సాయి సాశ్విత, సీఎంఏ విద్యార్థిని, డిప్లొమా రెండవ సంవత్సరం

విప్లవ యోధుడు భగత్‌సింగ్‌కు ఘన నివాళి



పోటీలో గెలుపొందిన విద్యార్థులతో లోకనాథం తదితరులు



అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహిస్తున్న అతిథులు

అనకాపల్లి : పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో భగత్‌సింగ్ 93వ వర్ధంతి శనివారం నిర్వహించారు. స్థానిక దొడ్డిరామునాయుడు భవనంలో భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు ఎస్ఎఫ్ఐ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ కార్యదర్శి కె.లోకనాథం పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ పౌరుషాన్ని యువత అందిపుచ్చుకోవాలన్నారు. అంతకు ముందు భగత్‌సింగ్ జీవిత చరిత్రపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శివాజీ, కోశాధికారి ఎస్.రమణ, మాజీ జిల్లా నాయకుడు ఆర్.శంకరరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జార్జి క్లబ్ ఆవరణలో..

స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొరమ్మనాయుడు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ఆవరణలో అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో..

కశింకోట : స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా సంయుక్త కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి : వివిధ రకాల పంటల్లో అధిక దిగుబడులు పొందేందుకు రైతులు నాణ్యమైన విత్తనాలు సమకూర్చుకోవాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు సంచులపై నాణ్యతను సూచించే చిహ్నాలు గమనించాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు మాట్లాడుతూ రబీ సీజన్‌లో నువ్వులు, జనుము పంటలు ఆశాజనకంగా ఉంటాయన్నారు. మార్చిలో కురిసిన వర్షాల వల్ల నువ్వుల పంటకు మేలు జరుగుతుందన్నారు. పప్పుధాన్యాలు, నువ్వులు, జనుము పంటలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీహెచ్ ముకుందరావు, టి.శ్రీలత, డి.ఆదిలక్ష్మి, ఎం.విశాలాక్షి, డి.ఉమామహేశ్వరరావు, రామలక్ష్మి, శిరీష, వివిధ మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న సెయింట్ జాన్స్ స్కూలు చిన్నారులు

కశింకోట : సెయింట్ జాన్స్ స్కూల్లో యూకేజీ విద్యార్థులకు శనివారం ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ లక్ష్యాలను ముద్దుముద్దు మాటలతో వెల్లడించడం ఆకట్టుకుంది. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాల్ రూపనంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలిపల్లెమ్మ జాతరకు ఏర్పాట్లు



ముస్తాబైన శ్రీ పోలిపల్లెమ్మ అమ్మవారి ఆలయం

తుమ్మపాల : మండలంలోని రేబాక గ్రామ ఇలవేల్పు శ్రీ పోలిపల్లెమ్మ తల్లి జాతర ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా మార్చిలో పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించే అమ్మవారి పండగ ఈ ఏడాది మార్చి 26న నిర్వహించేందుకును ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవంలో భాగంగా 24,25 తేదీల్లో ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం అన్నసమారాధన, సోమవారం పలు సాంస్కృతి కార్యక్రమాలు జరపనున్నారు. రేబాక గ్రామంలో విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాలు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కలిగి ఉండాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జోనల్ కమిషనర్, ఏఈఆర్‌వోలు, సెక్టార్ అధికారులు, ఎంపీడీవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో శాంతియుతంగా ఎక్కువ శాతం పోలింగ్ జరిగేలా స్వీప్‌ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ వీవీపీఐ నాయుడు, తహసీల్దార్ ఎల్.మధుసూదన, ఎంపీడీవోలు మోహన్‌కుమార్, శేషుబాబు, డీటీ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి వారికి గరుడసేవ



పురవీధుల్లో ఊరేగుతున్న వేంకటేశ్వర స్వామివారు

అనకాపల్లి : స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం స్వామివారి గరుడసేవ జరిగింది. పట్టణంలోని వీధుల గుండా స్వామివారిని ఊరేగించారు. అన్నమాచార్య వాగ్గేయ వరదయ్య బృందం సభ్యులచే సంకీర్తనలు, కోలాటం, కాగడాలు చిడతలు, తప్పెటగుళ్ల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజసులోచన, అర్చకులు పులఖండం గిరిబాబు, రాజేష్, విజయ్‌బాబు, ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు అడ్డుకట్ట వేయాలి

అనకాపల్లి : క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్ డీఎస్పీ ఎన్.అప్పలరాజుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఐక్యవేదిక సభ్యులు ఆళ్ల ప్రవీణ్ కుమార్, బొబ్బిలి గోవిందరాజులు, చిరంజీవి, ముగడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

అనకాపల్లి : మెయిన్‌రోడ్డులోని కోడుగంటి గోవిందరావు భవనంలో 24 ఉదయం జై భారత్ పార్టీ ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కనిశెట్టి సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఉత్తరాంధ్ర కన్వీనర్ జయదేవ్ హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చిన్నారుల హోలీ హంగామా



అనకాపల్లి : స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ ప్లేస్కూల్లో శనివారం చిన్నారులు ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. చిట్టిపొట్టి చిన్నారులంతా రంగులు చల్లుకుని, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్ కుమార్, ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



బర్మా కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని బడుగు, బలహీన వర్గాల ప్రజలు మరిన్ని సంక్షేమ పథకాలు అందుకునేందుకు తోడ్పడాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. బర్మా కాలనీలో శనివారం గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని ఆమె ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనకాపల్లి నియోజకవర్గం నుంచి మలసాల భరత్‌కుమార్ పోటీ చేస్తున్నారని, ఎమ్మెల్యే, ఎంపీ రెండు స్థానాలను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని ఆమె పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో లక్షలాది నిరుపేదల సొంతింటి కల వైఎస్సార్‌సీపీ పాలనలోనే నేరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మూనూరు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నేతలు కోన ఉమ, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



జమాదులపాలెంలో ప్రచారం చేస్తున్న భరత్‌కుమార్ సతీమణి నివేదిత

జమాదులపాలెంలో..

కశింకోట : మండలంలోని జమాదులపాలెంలో శనివారం అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన భర్త భరత్‌కుమార్‌కు ఘన విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, అమీన్‌సాహెబ్‌పేట మాజీ సర్పంచ్ మలసాల అనూరాధ, గూడెపు రాజు, ఒమ్మి గంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి



నరసింగబిల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న కోన నరసింగరావు

కశింకోట : విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ కోరారు. మండలంలోని నరసింగబిల్లి, సోమవరం, చింతలపాలెం, త్రిపురవానిపాలెం గ్రామాల్లో శనివారం రాత్రి మండల స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులు గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నారు. మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు, ఎంపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, సర్పంచ్‌లు కోన అరుణ, కొట్టి రాము తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలి

తుమ్మపాల : ఈ నెల 31తో జీవీఎంసీ పట్టణ పరిధిలో ఆస్తి, నీటి పన్ను వడ్డీ మాఫీ గడువు ముగుస్తుందని జీవీఎంసీ జోనల్ కమిషనర్ వీవీపీఐ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పన్నుదారులకు కార్యాలయం వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఇయన తెలిపారు. ప్రత్యేక కౌంటర్ ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు సెలవు దినాల్లో కూడా ఉంటుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అవగాహనతో క్షయవ్యాధి నిర్మూలన



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి పావని, సిబ్బంది, విద్యార్థులు

అనకాపల్లి : మండలంలో సీతానగరం, సిరసపల్లి గ్రామాల్లో శనివారం టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తగరంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి పావని మాట్లాడుతూ టీబీని ఓడించండి దేశాన్ని గెలిపించండి అనే నినాదంతో వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది మార్చి 24న ప్రపంచవ్యాప్తంగా టీడీ రోజుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షయవ్యాధి రోగులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందజేస్తున్నారని, వైద్యుల సలహా మేరకు ఆరుమాసాలు మందులు వాడుతూ, పరిశుభ్రమైన ఆహారం తీసుకుంటే టీబీని జయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.చంద్రశేఖర్, సన్యాసిరావు, ఎం.పెంటయ్య, ఆశ వర్కర్లు, సీతానగరం హైస్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

27న గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐ శంకరరావు తదితరులు

అనకాపల్లి : ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించాలని పట్టణ సీఐ జి.శంకరరావు అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో కుంచావారి గౌరీ పరమేశ్వరుల పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో కరపత్రాలను శనివారం ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు (అబ్బులు) ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ట సమయంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ అబ్బులు మాట్లాడుతూ గౌరీ పరమేశ్వరుల పంచలోహ ఉత్సవ విగ్రహ విరాళ దాత, వ్యాపారవేత్త మావూరి వెంకటరమణ, పద్మావతి దంపతుల ఆర్థిక సహకారంతో 250 కేజీల పంచలోహ విగ్రహం తయారు చేయించామని పేర్కొన్నారు. 27న పంచలోహ ఉత్సవ విగ్రహం ఊరేగింపు, 28న సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద మరో వ్యాపారవేత్త కాండ్రేగులనాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షుడు పొంద్రంకి సత్యారావు, సీనియర్ సభ్యులు కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజు రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు

గవరపేటలో 245 మందికి వైద్య సేవలు



రోగితో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద

కశింకోట : గవరపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 245 మందికి వైద్య సేవలందించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించారు. గర్భిణులు, కిశోరీ బాలికలకు రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు అందజేశారు. మెరుగైన ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని సూచించారు. షుగర్, బీపీ తదితర రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో శిబిరానికి హాజరై సేవలు పొందారు. ఏఎన్ఎం నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీ బిందు, హెల్త్ అసిస్టెంట్ సుభాని, ఆశ కార్యకర్తలు కనక, పార్వతి, శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.